నేడు రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పాలాలబస్తీ మగ్దూం నగర్‌లో ఆదివారం రేణుకా ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు ప్రాతస్మరాణం, గంగా సేకరణ, గంగ గౌరి పూజలు, పుణ్యవచనం, కంకణాదారణ, విగ్రహ జలాదివాసం, నవగ్రహ, దేవి మూలమంత్ర హోమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం ఎల్లమ్మ దేవి ప్రతిష్ఠ మహోత్సవం, బలిహరణ, పూర్ణాహుతి, మహా మంగళనిరాజనం, మహామంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, బోనాల అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

స్వర్ణామృత ప్రాశనంతో పిల్లలకు మేలు



జగద్గిరిగుట్ట: స్వర్ణామృత ప్రాశన పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుగుందని పంచగవ్య డాక్టర్ రాము రామానుజాచార్య అన్నారు. చింతల్ ద్వారకానగర్‌లో శనివారం సుమారు 100 మంది 16 సంవత్సరాల లోపు పిల్లలకు వికాస తరంగిని సంస్థ ద్వారా స్వర్ణామృతప్రాశన ఔషధం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్వర్ణామృతప్రాశన వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, గ్రహణ శక్తి పెరుగుతుందని తెలిపారు. ఇది ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్లపై వరదనీరు తొలగింపు



సుభాష్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నర్సాపూర్– బాలానగర్ ప్రధాన రోడ్డులో కొన్నిచోట్ల వర్షపు నీరు రోడ్డుపై నిలిచాయి. చింతల్, సూరారం ప్రధాన రోడ్లపై నీరు నిలిచిపోవడంతో శనివారం జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ట్రాఫిక్, హైడ్రా సిబ్బందితో కలిసి వర్షపు నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో వాహనాలు సాఫీగా వెళ్లాయి.

గేమ్ చేంజర్ అవార్డ్స్ ప్రదానోత్సవం



నిజాంపేట్: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థను స్థాపించి దశాబ్దకాలం పూర్తైన సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వారికి సంస్థ సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు అధ్యక్షతన గేమ్ చేంజర్ అవార్డులను శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారుల్లోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించేందుకే విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థను స్థాపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, జీవీఎస్‌కె కిశోర్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఈవెంట్ చైర్మన్‌గా విజయ కుమార్, కో చైర్‌పర్సన్‌గా సత్యవోలు పూజిత వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ పెరుగు శ్రీకాంత్ బాబు, ఏపీ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి.విజయ కుమార్, తెలంగాణ సెట్విన్ ఎండీకె వేణుగోపాలరావు, ఇంటెలిజెన్స్ ఏసీపీ రాజీవ్ రెడ్డి, సీఎం ప్రజావాణి సీపీ ఆర్వో రవిప్రతాప్, కె.త్రివిక్రమ్, డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రే, డాక్టర్ మామిడి భీమ్‌రెడ్డి, డాక్టర్ శాంతి భవాని, డాక్టర్ శ్రీప్రకాశ్, డాక్టర్ వక్కలంక రజని, నాగబాల సురేశ్‌కుమార్, కె.రాఘవరావు, వీవీఎస్ గోపాల కృష్ణ, ఉదయ్ శంకర్ అల్లం, బత్తుల బాపూజీ, హర్షవర్ధన్, స్వీటిరెడ్డి తదితరులు గేమ్ చేంజర్ అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో రైతు పిచ్చికల వెంకటనారాయణ, న్యాయవాది చంద్రగిరి రాధాకుమారి, జర్నలిస్ట్ సరేశ్ కుమార్, నీలిమ చలసాని, శ్రీకీర్తి, దిలీప్ కుమార్, రాజేశ్, సింగం శ్రీనివాసరావు, వెంకట సుబ్బారెడ్డి, రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, సురేశ్‌కుమార్, చిన్న బాబురావు, సురేంద్రనాథ్, ధీరజ్, లీలా ప్రసాద్, కోదాటి జగ్గయ్య, అస్లామ్, వినీత్‌బాబు, లయన్ ప్రతాప్‌కుమార్, రమణకుమార్, సత్యవోలు భూపతి, సుముఖ దత్తా, శివబాలాజీరెడ్డి అవార్డు అందుకున్నారు.

రంగుల నీళ్లు.. ఇంకెన్నాళ్లు!



బోరు నుంచి వచ్చిన కలుషిత నీరు

- దేవేందర్ నగర్‌లో కలుషితమైన భూగర్భ జలాలు
- బోర్‌ల నుంచి వాసన, నురుగుతో కూడిన రంగు నీళ్లు
- ఎలిప్ పరిశ్రమ వ్యర్థాల వల్లే అంటున్న స్థానికులు

సుభాష్‌నగర్: ఒకప్పుడు ఆ ప్రాంతంలో పచ్చని కొండల మధ్యలో నుంచి స్వచ్ఛమైన నీరు జాలువారేది. వేసవి కాలంలో సైతం 24 గంటల పాటు నిరంతరం నీరు పారుతూనే ఉండేది. వ్యవసాయంతో పాటు తాగునీటికి కూడా ఆ నీటిని ఉపయోగించుకునేవారు. ఆ ప్రాంతాన్ని ఆనుకొని మాయదారి విషం కక్కే పరిశ్రమ రావడంతో ప్రస్తుతం అక్కడ ఏ బోరు ఆన్ చేసిన రంగు నీళ్లతో కూడిన విషపు నీరు వస్తుంది. గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్, రావినారాయణరెడ్డి నగర్, శంకరయ్య భవాని ఎన్‌క్లేవ్, కైసర్ నగర్ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా బోర్ల నుంచి ఘాటైన వాసనలతో కూడిన రంగు నీళ్లు వస్తున్నాయి. పక్కనే ఉన్న ప్రగతినగర్ ఎలిప్ పరిశ్రమ నుంచి విషవాయులతో పాటు కెమికల్ వ్యర్థాలు వదులుతుండటంతో ప్రస్తుతం చుట్టుప్రక్కల బస్తీలలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం నిత్య అవసరాల కోసం వాడుకోవడానికి కూడా ఆ నీరు ఉపయోగపడడం లేదు. దేవేందర్ నగర్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెందిన 300 ఎకరాలు, మరో 200 ఎకరాల ప్రభుత్వం స్థలం ఉండేది. సదర్ స్థలంలో పచ్చని చెట్లతో కూడిన కొండలు ఉండేవి. ఆ కొండల మధ్యలో నుండి జాలువారుతున్న స్వచ్ఛమైన నీరు వేసవి కాలంలో సైతం వచ్చేది. చుట్టుపక్కల ఉన్నవారు వీటిని నిత్య అవసరాల కోసమే కాకుండా తాగునీటికి ఉపయోగించేవారు. స్థానికంగా ఎక్కడ బోరు వేసినా పది ఫీట్ల నుంచే నీరు ఉబికి వచ్చేది. ప్రస్తుతం ఏ బోరు ఆన్ చేసిన అందులో కెమికల్, ఘాటైన వాసనలతో కూడిన బురుగు నీరు వస్తుంది.



బోర్ నుంచి వస్తున్న నురగులతో నీరు

బోరు నీటిని వాడటం లేదు



ఒకప్పుడు మా ఊరు నుంచి స్వచ్ఛమైన నీరు వచ్చేది. కొన్ని నెలలుగా బోరు నుంచి కెమికల్ వాసనలతో కూడిన నీరు వస్తుంది. అన్ని బోర్ల నుంచి ఇలాగే వస్తుంది. దీంతో బోరు వాటర్ వాడటం లేదు. కాలనీవాసులు ట్యాంకర్ తెప్పించుకొని నీటిని వాడుకుంటున్నాం. అధికారులు పట్టించుకోని సమస్యకు పరిష్కారం చేయాలి.

– బాలరాజ్, శంకరయ్య భవాని ఎన్‌క్లేవ్.

చర్మంపై నీరు పడితే భగ్గుమంటుంది



కొన్ని రోజులుగా బోరు నీరు నురగలతో వస్తుంది. ఆ నీరు చర్మం పైన పడితే బగ్గుమంటుంది. ఇక బోరు వేయడమే మర్చిపోయాం. మంజీరా నీటినే ఉపయోగిస్తున్నాం. ఇలా ఎంతకాలం ఉండాలి. అధికారులు పట్టించుకోవాలి.

– శివలక్ష్మి, స్థానికురాలు



కలుషిత జలాలను చూపుతున్న శంకర్‌భవానీ ఎన్‌క్లేవ్ వాసులు

సైనికుల వల్లే సురక్షితంగా దేశం



5కే రన్‌ను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

సుభాష్‌నగర్: దేశ సరిహద్దులో సైనికుల రేయింబవళ్లు పహారా కాస్తున్నందు వల్లే మనం సురక్షితంగా ఉన్నామని, వారి సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని సూరారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో సూరారం కట్టమైసమ్మ నుంచి షాపూర్‌నగర్ చౌరస్తా వరకు నిర్వహించిన 5కే రన్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్ల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యకులు రాజా రెడ్డి, గారుబావిగడ్డ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, విగ్నేశ్వర్, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి, రాజేష్ చారి, రాజు, జోగిని సతీష్ సాగర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దుర్యోధనరావు, నాయకులు సంతోష్ గుప్తా, దీపక్, జాల వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి బీజేపీ నిరసన



నిజాంపేట్: ప్రజలకు కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై గుంతలలో మొక్కలు నాటి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేటలోని వైకుంతధామం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదన్నారు. పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ రోడ్ల మరమ్మత్తులపైన, డ్రైనేజీ నిర్మాణాలపైన, దోమల సమస్యపైన అధికారులు చూపటం లేదన్నారు. యంత్రాంగం స్పందించకుంటే కార్యకర్తలతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మూర్తి, దాసి నాగరాజు, ప్రసాద్‌రాజు, నరేంద్ర చౌదరి, వెంకటేష్ ముదిరాజ్, సెక్రెటరీ కౌశిక్ నాయుడు, సతీష్ కృష్ణ, పాండు, విష్ణుదత్తు, కుంకి రాము, సురేష్, రాజేష్ ముదిరాజ, భూపాల్, ఈశ్వర్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పీపీఈ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కార్మికులకు పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ప్రతినిత్యం కార్మికులు చెత్తను తరలిస్తున్నారని, కరోనా వంటి విపత్కర సమయంలో సైతం సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కూడా ఎంతో కీలకమన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారని అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ, ఏఎంహెచ్‌ఓ కవిత, ఎస్ఎఫ్ఏలు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. జీడిమెట్ల డివిజన్ టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు విధుల్లో పాల్గొనే పారిశుద్ధ్య సిబ్బంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ మండల వైద్యాధికారిణి స్వర్ణలత, సర్కిల్ వైద్య ఆరోగ్య అధికారి కవిత, ఎంటమాలజీ ఉమారాణి, పారిశుద్ధ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 400 మందికి పైగా సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించినట్లు పేర్కొన్నారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 2024–25 విద్యా సంవత్సరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా డీఆర్‌డీఓలోని క్షిపణులు వ్యూహాత్మక వ్యవస్థల ముఖ్య సంచాలకులు డా.యు.రాజాబాబు, అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపక చైర్మన్ అండ్ ఎండీ డా.సుబ్బారావు పావులూరి, ఐఐటీ హైదరాబాద్‌లోని డీఐఏ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంచాలకు డా.జి.రామగురు, ఎఎస్ఐపీ ఎండీ అండ్ సీఈఓ వెంకట సింహాద్రిలు హాజరయ్యారు. విజ్ఞాన జ్యోతి అధ్యక్షులు దగ్గుబాటి సురేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ప్రతిభను గుర్తిస్తూ 33 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు.

మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడి మృతి



దయాసాగర్ గుప్తా (ఫైల్)

సుభాష్‌నగర్: మీసేవ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నేత కొత్తపల్లి దయాసాగర్ గుప్తా (45) మృతి చెందారు. దైవ దర్శనంలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల ఆలయానికి పార్టీ కార్యకర్తలతో కలిసి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఫిట్స్, గుండెనొప్పి రావడంతో దయాసాగర్ అక్కడికక్కడే కుప్పకూలాడు. తోటి సహచరులు స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. ఆయన భౌతికాయాన్ని శనివారం సాయంత్రం సూరారం గ్రామానికి తరలించడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు సూరారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇటీవల 10 రోజుల క్రితమే మీసేవ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా దయాసాగర్ నియామకమయ్యారు.

శ్రీగంధం మొక్కల విక్రయం

సుభాష్‌నగర్: దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో శ్రీగంధం మొక్కలను విక్రయానికి అందుబాటులో ఉంచారు. రాష్ట్ర అటవీ శాఖ పరిశోధనా విభాగం , ఫారెస్ట్ రిసెర్చ్ సెంటర్ సిద్దిపేట జిల్లా ములుగు ఈ మొక్కలను అభివృద్ధి చేసినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఒక్కొక్క మొక్కను రూ.25 చెల్లించి కావాల్సిన మొక్కలను కొనుగోలు చేయవచ్చని, మరిన్ని వివరాల కోసం స్టేట్ సిల్వికల్చరిస్ట్, హైదరాబాద్‌ను సంప్రదించాలని కోరారు. ఆసక్తి కలిగిన రైతులు 8500771349, 9703433429, 944085592 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్లే స్కూల్‌లో ఫ్రూట్స్ డే




ఫలాల వేషధారణలో విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో శనివారం పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఫలాల దినోత్సవం నిర్వహించారు. ప్రీ ప్రైమరీ చిన్నారులు వివిధ రకాల ఫలాల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా చిన్నారులు తీసుకొచ్చిన పలు రకాల ఫలాలతో ఉపాధ్యాయులు ఫ్రూట్ సలాడ్ చేయించారు.

కార్గిల్ విజయ్ దివస్

నిజాంపేట్: కార్గిల్ విజయ్ దినోత్సవం భారత సైనికుల శౌర్యం, దేశభక్తికి నిదర్శనమని పలువురు అన్నారు. భారత సరిహద్దుల వద్ద వాస్తవాదీన రేఖను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని సుమారు 80 రోజుల విరోచిత పోరాటంతో తరిమికొట్టి 1999 జూలై 26న ఆపరేషన్ విజయ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన భారత సైనికులకు శనివారం లయన్స్ అన్నెం కోటిరెడ్డి ఆధ్వర్యంలో వందనాలు అర్పించారు. తరువాత వాయుసేన విభాగంలో అనేక సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన సోమా రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎం.రాంచందర్, ఎస్.నాగేశ్వరరావు, పి.సత్యనారాయణ, చంద్రయ్య, జైపాల్‌రెడ్డి, ప్రేమ కుమార్, జె.నాగేశ్వరారవు, విద్యాసాగర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుండిగల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గండిమైసమ్మ నుంచి సూరారం వైపు వెళ్లే దారిలో బహదూర్‌పల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. స్థానికులు 100 డయల్‌కు ఫోన్ చేయగా.. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 మధ్య ఉంటుందని, ఒంటిపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, భిక్షాటన చేస్తు జీవిస్తుంటాడని పోలీసులు తెలిపారు. రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతోనే తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎల్ఆర్ఐటీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులు

దుండిగల్: అంకితభావం, నిరంతర కృషి, ఆసక్తి మనస్తత్వంతో విద్యార్థులు తమ భవిష్యత్‌ను కొనసాగించాలని టాలెంట్ అక్విజిషన్ క్యాంపస్ రిలేషన్స్ ఆపరేషన్స్ నిపుణుడు హర్దీప్ సింగ్ భమ్రా అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 16వ గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 2020–2024, 2021–2025 బీటెక్ బ్యాచ్‌ల కోసం నిర్వహించిన ఈ వేడుకల్లో 2,230 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతి విభాగంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి ధీరన్‌రెడ్డి, డైరెక్టర్ అనుశ్రేయ రెడ్డి, కోశాధికారి మమతరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రావు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

సుభాష్‌నగర్: దూలపల్లిలో కొన్ని రోజులుగా అలుముకున్న చీకట్లకు వెలుగు వచ్చాయి. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఇటీవల స్థానికులు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై చీకట్లో క్యాండిల్ వెలిగించి నిరసన తెలిపారు. ఎట్టకేలకు సంబంధిత అధికారులు దిగివచ్చి వీధిలైట్లు వెలిగేందుకు పనులు చేపట్టారు.

మెప్మా సభ్యుల ఉత్పత్తుల ప్రదర్శన



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: మెప్మా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ద్వారా ఆర్థికవృద్ధి సాధించాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల పాలనలో భాగంగా శనివారం కొంపల్లి మున్సిపల్ కమ్యూనిటీ హాలులో మెప్మా మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రైవేట్ ఆసుపత్రుల సౌజన్యంతో మెప్మా సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకర హాస్పిటల్ యురాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శరత్, న్యూరాలజిస్ట్ డాక్టర్ సందీప్ రాజ్, విజేత హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రియదర్శిక, సురక్ష హాస్పిటల్ వైద్యులు సౌమ్య, న్యూరాలజిస్ట్ పూజిత, గౌతమ్ హాస్పిటల్ డాక్టర్ దీప్తిలు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ తిరుపతి, ఆర్ఐ రాజు, మెప్మా ఏడీఎంసీ ఉమేష్, పద్మావతి, సౌమ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానీ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల మోసంలో మరో బీఆర్ఎస్ నాయకుడి అరెస్టు



పోలీసుల అదుపులో శ్రీధర్, ప్రసాద్

జీడిమెట్ల: డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుడితో పాటు మరో వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు శనివారం తరలించారు. బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ బ్యాంక్ కాలనీకి చెందిన జి.శ్రీధర్ గతంలో ఎమ్మెల్యే వెంట తిరిగేవారు. ప్రతిరోజు ఉదయం క్యాంపు ఆఫీస్ వద్దనే ఉంటూ ఎమ్మెల్యే అనుచరుడు అన్నట్లుగా ప్రచారం చేసుకున్నాడు. మంత్రులతో దిగిన ఫొటోలు చూపిస్తూ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని పలువురిని నమ్మించాడు. వాటికి సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో డబ్బులు లాగాడు. ప్రదీప్ ప్రసాద్ అనే వ్యక్తి ద్వారా ఫొటోషాప్ సాయంతో నకిలీ పత్రాలు సృష్టించి పలువురికి ఇళ్లు మంజూరైనట్లు పత్రాలు ఇప్పించాడు.

ఫిర్యాదుతో వెలుగులోకి..

కుత్బుల్లాపూర్‌కు చెందిన మల్లేశ్వరి శ్రీధర్‌ను నమ్మి డబ్బు చెల్లించింది. ఎంతకూ డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన తన డబ్బులు తనకు ఇవ్వాలని అడిగింది. శ్రీధర్ ముఖం చాటేశాడు. దీంతో మల్లేశ్వరి జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు శ్రీధర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు అతనికి సహకరించిన ప్రదీప్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కంప్యూటర్, ప్రింటర్లు, ఒక కారు, రెండు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని శనివారం రిమాండుకు తరలించారు.